క్లుప్తంగా

వైభవంగా లక్ష తులసి పూజ



ఉయ్యూరు: మండలంలోని గండిగుంట దత్త దేవాలయంలో లక్ష తులసి పూజ బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ అనఘా దత్త దిగంబర స్వామి అవతార జయంతి సందర్భంగా దత్త దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చరణతో లక్ష తులసీ పూజ, గోపూజ, హోమం, పంచామృత అభిషేకం, నవగ్రహ పూజ జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని తరించారు. ఈ సందర్భంగా కార్తీక అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ పీఆర్ఓ నారాయణమూర్తి పర్యవేక్షించారు.

బోధనలో మెలకువలు పాటించాలి



పెనమలూరు: ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహేరాసుల్తానా అన్నారు. పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మ్యాథ్స్ కాంప్లెక్స్‌లో పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేయాలని తెలిపారు. బోధనలో మెలకువలు పాటించాలని సూచించారు. విద్యార్థులు సబ్జెక్ట్‌లపై పట్టుసాధించే విధంగా సాధన చేయించాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కనకమహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


236 మంది క్రీడాకారుల రిజిస్ట్రేషన్

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల 15వ తేదీ నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్రాకు క్రీడాభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రకటించిన కేవలం రెండు రోజుల్లో అధిక సంఖ్యలో నమోదవుతున్నాయి. విజయవాడ రూరల్ మండలంలో రెండు రోజుల్లో 236 మంది క్రీడల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ బి.భార్గవి తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సచివాలయాల్లో కానీ, స్వయంగా యాప్ డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ స్థాయిల్లో ఉన్న క్రీడాకారులు కూడా ప్రభుత్వం నిర్వహించే ఆడుదాం ఆంధ్రలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కుట్టు శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి

ఉంగుటూరు: స్వచ్ఛంద సంస్థల స్వయం ఉపాధి శిక్షణ తరగతులను గ్రామీణ నిరుద్యోగ యువత వినియో గించుకోవాలని ఎంపీడీవో శేషగిరిరావు సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో స్వయం సహాయక మహిళలతో సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యూనియన్‌బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వశక్తి, వల్లభనేని అరుణా చారిటబుల్ ట్రస్ట్‌ల అధ్వర్యంలో గ్రామీణ యువతులకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చేందు త్వరలో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. 18 నుంచి45 సంవత్సరాలు కలిగిన మహిళలకు 30 రోజులు స్థానిక స్త్రీశక్తి భవనంలో కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, కుట్టు మిషన్, మెటీరియల్ ఉచితంగా అందజేస్తారని వివరించారు. ఆసక్తిగలవారు ఎంపీడీవో కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. త్వరలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ చేతులమీదుగా ప్రారంభిచనున్నట్లు పేర్కొన్నారు. ఈవోఆర్‌డీ బాషా, ఏపీఎం సాం బశివరావు, స్వశక్తి డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పీవీపీ సిద్ధార్థ విద్యార్థులకు అవార్డులు



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు వివిధ రంగాల్లో చేసిన సామాజిక సేవలకు అవార్డులు వచ్చాయి. కాలేజీకి చెందిన విద్యార్థులు పీవీపీ సిద్ధార్థ రోటరాక్ట్ క్లబ్ ద్వారా వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందించారు. దీంతో విజయవాడ భవానీపురంలో ఇటీవల జరిగిన రోటరీ జోనల్ కాన్ఫరెన్స్‌లో 18 అవార్డులను విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చాటి అవార్డులు గెలుచుకున్న విద్యార్థులకు కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అభినందించారు.

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం

పెనమలూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయటం జగనన్నకే సాధ్యమని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. కానూరు మురళీనగర్ 5వ సచివాయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేశారన్నారు. నవరత్నాల ద్వారా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అవినీతి లేకుండా అమలు చేశారని వివరించారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలతో పేదలను దగా చేశారని ధ్వజమెత్తారు. నేడు సచివాలయ వ్యవస్థతో పారదర్శక పాలన అమలవుతుందని పేర్కొన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాన్‌బాషా మాట్లాడుతూ మురళీనగర్ సచివాలయం పరిధిలో రూ.77.92 కోట్లు సంక్షేమ పథకాలతో పేదలకు నేరుగా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందని తెలిపారు. కులమతాలకు అతీతంగా జగనన్న పాలన సాగిస్తూ పేదలను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సహకారంతో మురళీనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావిపూడి విజయరమేష్, నేతలు వేమూరి బాలకృష్ణ, మజ్జి శివ, తుమాటి శ్రీరాములు, ఆంజనేయ ప్రసాద్, అజీజుల్లా, తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, స్థానికులు పాల్గొన్నారు.

జనం నమ్మకమే జగన్

ఉయ్యూరు: జనం నమ్మకమే జగనన్న అని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. ఉయ్యూరులోని 1, 2 వార్డుల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయా వార్డు సచివాలయాలను సందర్శించి అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎం జగన్ ఆవశ్యకతను



ఉయ్యూరులో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, కౌన్సిలర్లు, అధికారులు

వివరించారు. ఆయా వార్డుల్లో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, సచివాలయ కన్వీనర్ వణుకూరు సురేష్, కౌన్సిలర్లు గుంజా సుధాకర్‌బాబు, తెనాలి పద్మావతి, డాక్టర్ జంపాన పూర్ణిమ, కూరాడ వెంకటలక్ష్మి, ఎం. లక్ష్మి, ఎండి బేగ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, నాయకులు జంపాన కొండలరావు, అబ్దుల్ సద్దాం, అహ్మద్‌ఖాన్, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

కంకిపాడు: జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు-2 సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సచివాలయాన్ని సందర్శించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, లబ్ధిదారులతో మమేకం అయ్యారు. సచివాలయంలో ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాకీ బాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే తలంపుతోనే సీఎం జగన్ సంక్షేమ పాలన సాగిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి అంటే రహదారులు నిర్మించటం ఒక్కటే కాదన్నారు. ప్రజలు పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించటమే నిజమైన అభివృద్ధి అన్నారు. సచివాలయం పరిధిలో ప్రజలకు రూ.22.36 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, ఎంపీటీసీ బూరగ బాలాజీ, నాయకులు బిళ్లా వెంకటేశ్వరరావు, కొటేలు వెంకటేశ్వరరావు, ఈఓ బి.వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి జగదీష్, వలంటీర్లు, లబ్ధిదారులు, వీఓఏలు పాల్గొన్నారు.

సంక్షేమంలో ఏపీ దేశానికే ఆదర్శం

కంకిపాడు: సంక్షేమ పాలన అందించటంలో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు అన్నారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని నిమ్మతోట, ఎస్సీ కాలనీ, జగనన్న లే అవుట్, ఇందిరమ్మకాలనీ, ప్రధాన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పాలన వివరించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి, సంక్షేమ బ్రోచర్లు పంపిణీ చేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలవాలని, ప్రతిపక్షాలు చేసే విమర్శలను విలువైన ఓటు ద్వారా తిప్పికొట్టాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ లాం పార్వతి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, నాయకులు లాం సురేష్, వెంగల నాగయ్య, నిమ్మకూరి రామారావు, వెంగల హరి, నెరుసు లక్ష్మణరావు (నాని), లాం పురుషోత్తం పాల్గొన్నారు.



కానూరు సచివాలయంలో సంక్షేమ పథకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



ఈడుపుగల్లు-2 సచివాలయంలో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న బాకీ బాబు, ప్రజాప్రతినిధులు



ఉప్పలూరులో సంక్షేమ బ్రోచర్లను అందజేసి ప్రభుత్వ పాలన వివరిస్తున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

భక్తిశ్రద్ధలతో బాబా మందిర వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా ప్రతిమ

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లో నిర్మించిన ధ్యాన యోగసాయి మందిర రెండో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజించారు. వివిధ పండ్ల రసాలతో సాయిబాబాకు అభిషేకాలు జరిపించారు. గణపతి, దత్తాత్రేయ, సాయి, రుద్ర, నక్షత్ర, మన్యుహోమాలు చేశారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. ప్రవచనకర్త కోటంరాజు వెంకట సాయి కృష్ణ ప్రసాద్ శ్రీ సాయిలీలాప్రవచనం చేశారు. కార్యక్రమాన్ని కాలనీ భక్తబృందం పుష్ప, విజయ, వామాక్షి, శ్యామల, లక్ష్మి, గణేష్, ప్రసాద్, హేమంత్, శివయ్య పర్యవేక్షించారు.



పూజలో పాల్గొన్న భక్తులు

ధాన్యం తేమ శాతం తగ్గితే గిట్టుబాటు ధర

పెనమలూరు: రైతులు ధాన్యం తేమ శాతం తగ్గే విధంగా చర్యలు తీసుకుంటే ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రైతులకు వస్తుందని ఏడీఏ ఎం.సునీల్ అన్నారు. తాడిగడప గ్రామంలో బుధవారం ధాన్యం విక్రయ కేంద్రాన్ని, లోడింగ్‌ను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ సునీల్ మాట్లాడుతూ రైతులు పండించిన వరి పంటను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం 75 కేజీల బస్తా 1652, కామన్‌వెరైటీ ధర రూ.1630 చొప్పు కొనుగోలు చేస్తారన్నారు. ధాన్యం తేమ శాతం 17 శాతంకు మించి ఉండరాదని తెలిపారు. రైతులు ధాన్యం తేమ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తేమ శాతం పెరిగితే ధాన్యం ధర నిబంధనల మేరకు తగ్గుతుందన్నారు. రైతులు ధాన్యం ఎండబెట్టుకోని విక్రయించాలని కోరారు. రైతులకు హమాలీ చార్జిలు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఇప్పుడు కొనుగోలు కేంద్రం ద్వారా ధాన్యం తరలించిన రైతులకు వెంటనే ప్రభుత్వం సొమ్ము విడుదల చేస్తుందని వెల్లడించారు. తాడిగడపలో 1100 బస్తాల లోడ్‌తో లారీని పంపారు. ఈ కార్యక్రమంలో ఏవో కనకమేడల శైలజ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తాడిగడపలో ధాన్యం లారీలో తరలించే ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఏడీఏ సునీల్, ఏవో శైలజ

కిడ్నీ బాధిత బాలుడికి ఆర్థిక సాయం

రామవరప్పాడు: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడుకు ప్రసాదంపాడులోని గ్రీన్ వుడ్స్ అపార్టుమెంట్ వాసులు చేయూత నందించారు. అపార్టుమెంట్‌లోని 80 ప్లాట్‌లలో నివాసం ఉంటున్న వారంతా కలిసి మానవతా దృక్పథంతో స్వచ్ఛందంగా ముందుకొచ్చి బాలుడి పేరిట రూ.60 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌తో పాటు కొంత నగదును ఆర్థిక సాయంగా అందించారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బాధిత బాలుడి తండ్రి పెద్దిరాజుకు పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన డాక్యుమెంట్లును అందజేశారు. ప్రసాదంపాడులోని గ్రీన్ వుడ్స్ అపార్టుమెంట్‌లో మునగాల పెద్దిరాజు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇతని కుమారుడు వెంకన్నకు (10) ఒక కిడ్నీ పనిచేయకపోవడంతో ఇటీవల శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఆ బాలుడు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలకు ఉపయోగపడే విధంగా అపార్టుమెంట్ వాసులు ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్ సహాయం అందించారు. వీరితో పాటు ప్రసాదంపాడు ఉపసర్పంచ్ గూడవల్లి నరసయ్య, మానవతా స్వచ్ఛంద సేవా సమితి, స్పందన సేవా సమితి వారు కూడా కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అపార్టుమెంట్ అధ్యక్షులు ఎం. వి బాబు, కార్యదర్శి వి. సూరిబాబు, కోశాధికారి శంకరమంచి లక్ష్మి లలిత, అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్ డాక్యుమెంట్లను అందజేస్తున్న అపార్టుమెంట్ వాసులు

చిత్రలేఖనంలో సెయింట్‌జాన్స్ విద్యార్థుల ప్రతిభ

గన్నవరం: రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక వీఎస్. సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా విజయవాడ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ అకాడమీ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాల సంయుక్తంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. జూనియర్స్ విభాగంలో బి. సుశాంత్, జి. నవయాన్‌రెడ్డి ద్వితీయ స్థానం, సబ్‌జూనియర్స్‌లో జీఎల్ లెవియానా, సీనియర్ కేటగిరిలో బి. సూరజ్ తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సాహించడమే మౌంట్‌పోర్టు విద్యా సంస్థల ప్రత్యేకతని తెలిపారు. అనంతరం విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు డి. శ్రీనివాసరావును ప్రిన్సిపాల్‌తో పాటు సీనియర్ బ్రదర్ జిమ్మీకురియోకోస్, బ్రదర్ భల్లాజోసఫ్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన



కార్డులను పంపిణీ చేస్తున్న ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి

కంకిపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి అన్నారు. మండలంలోని కందలంపాడు గ్రామంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి ప్రజలకు మందులు పంపిణీ చేశారు. పీఎంజిఎస్‌వై కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామసభలో బిందుమాధవి మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు, ఈఓఆర్‌డీ పీవీఎస్ మైథిలి, కార్యదర్శి సువర్ణలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ సాయి నిఖిత, వీఆర్ఓ రఘురాంప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా వైఎస్సార్ సీపీ

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ స్నిగ్ధ

కంకిపాడు: ఆపదలో ఉన్న కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన ముచ్చు ఫణీశ్వరరావు, ముచ్చు రాజేంద్రప్రసాద్ కుటుంబాలకు రక్ష ఫౌండేషన్ తరఫున డీసీఎంఎస్ చైర్‌పర్సన్ రూ.20 వేలు ఆర్థిక సాయం బుధవారం అందించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా పడమట స్నిగ్ధ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని అనునిత్యం కాంక్షిస్తారన్నారు. ఆపదలో కుటుంబాలు చిక్కుకుంటే వారిని ఆదుకోవటం కోసం చర్యలు తీసుకుంటారని చెప్పారు. అదే రీతిన రక్ష ఫౌండేషన్ కూడా పేదలకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అందరి సంక్షేమం కోసం పనిచేసే జగనన్నకు, వైఎస్సార్ సీపీకి బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు మరీదు గురుప్రసాద్, మాదు శివప్రసాద్, ముక్కు అవినాస్, చెన్ను బాబూజీ, వై.మధురమోహన్‌రావు, మాదు రామారావు, బి.పాండురంగారావు, పి.రాజు పాల్గొన్నారు.

స్థల వివాదంపై పరస్పర ఫిర్యాదులు

గన్నవరం: స్థలం వివాదం విషయమై కొంత మంది తనపై దాడిచేసి తీవ్రంగా కొట్టినట్లు ఓ బాధితుడు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం...శ్రీనగర్‌కాలనీలో నివసిస్తున్న ప్రవాసాంధ్రుడైన కొడాలి ఏకాంబరరావుకు కేసరపల్లి శివారు దుర్గాపురంలో 55 సెంట్లు వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమి పక్కన కొందరు ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకుంటున్నారు. ఈ విషయమై కొంత కాలంగా వీరి మధ్య గొడవ జరుగుతుంది. ఈ నెల 25న పంచాయతీ సిబ్బంది సమక్షంలో ఏకాంబరరావు తన భూమిలో ఉన్న ఆక్రమణలను పొక్లెయిన్‌తో కూల్చివేశారు. ఈ నేపథ్యంలో కూల్చివేసిన రాళ్లు, చెట్లను వృద్ధురాలు రాజ్యలక్ష్మి అదే స్థలంలో పడవేస్తుండగా వీడియో తీస్తున్న తనపై దాడికి దిగినట్లు ఏకాంబరరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికులైన జేమ్స్, రత్నాకర్, విష్ణు, రాజ్యలక్ష్మి దాడిచేసి తనను కొట్టినట్లు తెలిపారు. అయితే తమ నివాస ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు పొక్లెయిన్‌తో మొక్కలు, సామగ్రి ధ్వంసం చేసినట్లు వృద్ధురాలు రాజ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇప్పటికే ఏకాంబరరావుపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నివసిస్తున్న తమను కొంత కాలంగా ఏకాంబరరావు వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. అయితే ఏకాంబరరావు ఫిర్యాదుపై కూడా విచారణ చేపట్టామని సీఐ పి. కనకరావు తెలిపారు.

ముగ్గురి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: మాచవరం, కృష్ణలంక ప్రాంతాలకు చెందిన మాదిరి అరుణ్‌కుమార్ అలియాస్ పెద్దరాజు, మాదిరి వరుణ్‌కుమార్ అలియాస్ చిన్నరాజు, షేక్ కరీముల్లాల నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తూ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముగ్గురు నిందితులు గతంలో పలు నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లారు. జైలు జీవితం అనుభవించిన తరువాత కూడా వీరి ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించారు. తాజాగా వీరి బహిష్కరణ పొడిగించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెన్స్ నిమిత్తం వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కంఢ్రిక, కొత్తగూడెం, చిక్కవరం, చింతగుంట, బీబీగూడెం, గొల్లనపల్లి, కొండపావులూరు, ముదిరాజుపాలెం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: యనమలకుదురు కరకట్ట పై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు అంబేడ్కర్‌నగర్ కరకట్ట ప్రాంతానికి చెందిన నంబూరు మల్లేశ్వరరావు ప్లంబర్ పని చేస్తాడు. మంగళవారం గ్రామంలో కొండ పై పనికి వెళ్లి తిరిగి బైక్ పై ఇంటికి వస్తూండగా విజయవాడ-అవనిగడ్డ కరకట్ట పై ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది. బాధితుడి తలకు గాయాలు కావడంతో కానూరులో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ట

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లేలో అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవోపేతంగా జరిగింది. కేరళకు చెందిన గురుస్వామి మధుసూదన్ నంభూద్రి, ఏలూరుకు చెందిన గురుస్వామి తడికమళ్ల ప్రసాద్ నేతృత్వంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ, వాయు ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆవు నెయ్యి, ఆవు పాలతో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు కనులపండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు హాజరయ్యారు. అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. దాదాపు రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి అయ్యప్ప పడిపూజ, భజన ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అక్కినేని బాపూజీ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేపట్టారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ వితరణ

ఉయ్యూరు: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో విద్యార్థినికి సైకిల్‌ను వితరణగా అందజేశారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పూజితకు సైకిల్‌ను జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అందజేశారు. విద్యా ప్రోత్సాహక సేవ కార్యక్రమంలో భాగంగా సైకిల్ అందజేశామని క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, పిడి జి.వి. రమణ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నల్లా శ్రీనివాసరావు వీణావాహి ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం




ఉయ్యూరు: ఓటు హక్కు వజ్రాయుధమని ఉయ్యూరు ఆర్‌డీఓ డి.రాజు అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరులో ఓటు హక్కుపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏజీఅండ్ఎస్‌జి సిద్దార్థ కళాశాల నుంచి ప్రధాన సెంటరు వరకూ ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై చైతన్యం కల్పించారు. ఆర్‌డీఓ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని సమర్థుడైన ప్రజాప్రతినిధులను ఎన్నిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, మండల వ్యవసాయ మండలి చైర్మన్ పడకల వీర్రాజు, పీఏసీఎస్ చైర్మన్ కసుకుర్తి స్వరూపారాణి, మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని పాల్గొన్నారు.

పండితులకు సత్కారం



గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో బుధవారం శ్రీ వైఖానస యూత్ ఫోరం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు దీవి రామకృష్ణమాచార్యులు, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస కృష్ణమాచార్యులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పండితుల దంపతులకు సత్కారం నిర్వహించారు. 500 మంది వనసమారాధనలో పాల్గొనగా, నిర్వాహకులు అన్నసమారాధన చేశారు.